BHARATH SAMACHAR DIGITAL

25, సెప్టెంబర్ 2026, శుక్రవారం భారత్ సమాచార్

గల్లీ నుంచి ఢిల్లీ వరకు.. బీసీ కులగణన కోసం ఉద్యమం



భారత్ సమాచార్, మెదక్ జిల్లా: దేశవ్యాప్తంగా చేపడుతున్న జనాభా లెక్కల సేకరణలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారం డిమాండ్ చేశారు. బీసీ కులగణన పూర్తయ్యే వరకు తమ పోరాటం ఆగదని, బీసీల హక్కుల సాధన కోసం పోరుబాటలో పలు ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని అయన ప్రకటించారు.

బీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి

రామాయంపేటలోని బీసీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మెట్టు గంగారం మాట్లాడుతూ.. దేశ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు జనగణనలో ప్రత్యేకంగా వివరాలు నమోదు చేసే అవకాశం కల్పించాలని కోరారు. కులగణన చేపట్టకపోవడం వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అయన పేర్కొన్నారు.

బీసీల సమస్యలపై రాజకీయ పార్టీలు ముసలి కన్నీరు కారుస్తున్నాయని విమర్శిస్తూ, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. బీసీలకు న్యాయం జరగాలంటే జనగణనలో వారి జనాభా వివరాలను కచ్చితంగా నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కేంద్ర ప్రభుత్వంపై డిమాండ్

ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని మెట్టు గంగారం డిమాండ్ చేశారు. బీసీల జనాభాకు సంబంధించిన సమగ్ర గణాంకాలు అందుబాటులో ఉంటేనే వారి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి తదితర అంశాల్లో సరైన ప్రణాళికలు రూపొందించేందుకు అవకాశం ఉంటుందని అయన పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై ఆలోచించి జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ చేర్చాలని, లేకుంటే దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని గంగారం హెచ్చరించారు.

అక్టోబర్ 4న బీసీ కులగణన గర్జన

బీసీ కులగణన సాధన కోసం బీసీ సంక్షేమ సంఘం అధ్వర్యంలో గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరుబాటలో పలు ఉద్యమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మెట్టు గంగారం తెలిపారు. ఇందులో భాగంగా అక్టోబర్ 4న పాలమూరు నుంచి బీసీ కులగణన గర్జన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు.

అనంతరం అక్టోబర్ 8న ఢిల్లీలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించడంతో పాటు మేధావులు, ప్రొఫెసర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. బీసీ కులగణన కోసం ఉద్యమాన్ని దశలవారీగా కొనసాగిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో పలువురు పాల్గొనగా..

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారం, మెదక్ నియోజకవర్గ కన్వీనర్ మామిడి సిద్ధారములు, రామాయంపేట మండల అధ్యక్షులు ఉడుత రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar